


నల్లమలలో కనువిందు చేస్తున్న గుమ్మితం జలపాతం



- ఫొటోగ్రఫీ చరిత్రకు 190 వసంతాలు
- ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్
- రంగుల ఛాయా చిత్రాలకు 71 ఏళ్లు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


జ్ఞాపకం.. పదిలం



ఆత్మకూరు, ఆగస్టు 18:

కరిగే కాలంలో చెదరని మధుర స్మృతులకు ప్రతిబింబాలు ఫొటోలు. ప్రతి ముఖ్య సన్నివేశాన్ని కెమెరాలో బంధించి జీవిత కాలం వాటిని పదిలంగా దాచుకుని అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపి గుర్తు ఫొటో. ఓ మాట విన్నా.. ఓ పదం చదివినా కొన్నాళ్లకు మర్చిపోతాం. కానీ ఓ ఫొటో చూస్తే.. ఎంతోకాలం మదిలో ముద్ర పడిపోతుంది. ప్రతి ఫొటో వెనక ఒక జ్ఞాపకం, ఓ కథ, ఓ అనుభూతి దాగుంటుంది. ఇంతటి జ్ఞాపకాలను పంచే ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఓ ముఖ్యమైన రోజు ఉంది. ఇందుకోసం ప్రతి ఏటా ఆగస్టు 19వ తేదీన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ప్రపంచదేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. 190 ఏళ్ల క్రితం అవసరమైన ఆకారాన్ని ప్రముఖ చిత్రకారులచే గీయించేవారు. ఈ రోజు మనం క్షణాల్లో ఫొటోలు తీసి చూడగలుగుతున్నామంటే దీని వెనుక సుదీర్ఘ ప్రయోగాలు చేసిన శాస్త్రవేత్తలు ఎందరో ఉన్నారు. మారుతున్న టెక్నాలజీతో ఫొటోగ్రఫీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది.

ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్



విలియం హెన్రీఫాక్స్‌ను ఫాదర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అని చెప్పవచ్చు. జర్మనీలో శాస్త్రవేత్తగా ఉన్న ఈయన 1830లో ఓ సన్నని రంధ్రం గుండా చీకటి పెట్టెలోకి వెలుగును ప్రసరింపజేసి ఆ ప్రతిబింబాన్ని కళ్లతో చూడవచ్చని మొట్టమొదటిసారిగా వెల్లడించాడు. తిరిగి ఆ బింబాన్ని కెమెరాలో బంధించడం సాధ్యమని నిరూపించిన మొట్టమొదటి వ్యక్తి ఈయనే. 1835లో ప్రతిబింబాన్ని రసాయనాలతో కూడిన కాగితంపై నిమిషంపాటు నిలిపాడు. 1837లో జోసఫ్ నిసిఫార్ నిఫిస్ అనే శాస్త్రవేత్త విలియమ్స్ ప్రయోగాలకు ఆసక్తుడై లోహ ఫలకాలపై రసాయనాలతో కొన్ని గంటలపాటు నిశ్చల ప్రతిబింబాన్ని ఏర్పరిచాడు. 1838లో లూయిస్ జాక్వియస్ మ్యాండి విలియమ్స్ ప్రయోగాలను, వివరాలను ప్రపంచానికి తెలియజేశాడు. 1843లో నిప్సి-డి-సెయింట్ విక్టర్ గాజు అద్దంపై కోడిగుడ్డు సొన, పొటాషియం అయోడిన్, సిల్వర్ నైట్రేట్, జాలిక్ యాసిడ్ రసాయనాలతో ఫొటోగ్రఫీని అభివృద్ధి చేశాడు. 1900లో సాంకేతిక మార్పుల వల్ల గాజు ఫలకం నుంచి సెల్యులాయిడ్ అనే ప్లాస్టిక్ ఉపరితలంపై ప్రతిబింబాన్ని మార్చే ప్రక్రియ మొదలైంది. దీన్నే నేడు మనం నెగెటివ్ ఫిలింగా పిలుస్తున్నాం. ఇదంతా బ్లాక్అండ్ వైట్ ఛాయా చిత్రకళకు సంబంధించిన అంశం.









కలర్ యుగానికి 71 ఏళ్లు

ఓ శాస్త్రవేత్త కూతురు మాటలకు స్ఫూర్తే ఇప్పటి కలర్ ఫొటోగ్రఫీ. 1950లో జర్మనీకి చెందిన జాన్ పీటర్సన్ శాస్త్రవేత్త రూపొందించిన బ్లాక్అండ్‌వైట్ చిత్రాలను చూసిన అతని కూతురు ఇదే తరహాలో కలర్ ఫొటోలను సృష్టించలేమా అని ప్రశ్నించింది. అప్పటి నుంచి మూడేళ్ళ పాటు శ్రమించిన పీటర్సన్ కలర్ ఫొటోగ్రఫీ యుగానికి నాంది పలికాడు. అనతి కాలంలోనే ఛాయా చిత్రాల నుంచి మూవీ చలన చిత్రాల వరకూ ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కింది. ఆ తర్వాత విస్తృత ప్రయోగాలతో నేడు ఫొటోగ్రఫీ లేని విభాగమంటూ ఏదీ లేదని చెప్పవచ్చు. 190 ఏళ్ల క్రితం చిన్న పెట్టె రూపంలో తయారైన ఫొటో కెమెరాలు నేడు అతి భారీ పరిమాణంలో విశ్వంలో హబుల్ టెలిస్కోప్ రూపానికి ఎదిగాయి. ముఖ్యంగా వైద్యశాస్త్రానికి ఈ ఫొటోగ్రఫీ ఎంతో ఉపయోగపడుతుంది. ఇండస్ట్రియల్, మైక్రో, ఆస్ట్రో, శాటిలైట్, ఓసియన్, ఇన్‌ఫ్రారెడ్, ఫోరెన్సిక్, ఏరియల్, సినిమాటోగ్రఫీ, స్టిల్ ఫొటోగ్రఫీ తదితర రీతుల్లో ఛాయా చిత్ర విభాగం ఎదిగింది. 64 కళల్లో ఛాయా ఫొటోగ్రఫీని కూడా ఒక కళగా ప్రపంచం గుర్తించి 50 ఏళ్లకు పైనే అయింది. నేడు అతి తక్కువ ధరల నుంచి కోట్ల రూపాయల వరకూ విలువ చేసే ఫిల్మ్, డిజిటల్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా డ్రోన్ కెమెరాల వల్ల ఆకాశం నుంచి 360 డిగ్రీల కోణంలో ఫొటోలో తీసే అవకాశం ఏర్పడింది. అలాగే ప్రస్తుతం అన్ని రకాల మొబైల్‌లో నేడు కెమెరా సౌకర్యం కూడా కల్పించడం గమనార్హం. ఇంతటి ఫొటోగ్రఫీ అభివృద్ధికి కారకులైన విలియం హెన్రీఫాక్స్ లాంటి శాస్త్రవేత్తలను ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్మరించుకోవడం ఆనవాయితీగా మారింది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



నంద్యాల (కల్చరల్), ఆగస్టు 18: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

రుద్రగుండం కోనేరులో విరిగిన రాతి నంది

మహానంది, ఆగస్టు 18: మహానంది శైవ క్షేత్రంలో వెలసిన ప్రధాన గర్భాలయం స్వయంభూ లింగం నుంచి ప్రధాన రుద్రగుండం కోనేరులోకి నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఎక్కడి నుంచి నీటి ప్రవాహం వస్తుందో నేటికీ ఎవరికీ అంతుచిక్కడం లేదు. అలాంటి గొప్ప చరిత్రకు ఆనవాలుగా ఉన్న ప్రధాన కోనేరులోని పురాతన రాతి నంది విగ్రహం తల భాగం ఆదివారం విరిగింది. గతంలో ఇలాగే విరగడంతో అప్పటి దేవదాయశాఖ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కోనేరులో భక్తులు స్నానాలు చేసే సమయంలో రాతి నందిపై బల ప్రయోగాలు చేస్తుండటం వల్ల విరిగిపోయినట్టు తెలుస్తోంది. అయితే ఆలయ అధికారులు విరిగిన రాతి నందిని ఇప్పటి వరకు గుర్తించకపోవడం గమనార్హం. అప్పట్లో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపట్టి ఉంటే ఇలాంటి వచ్చేది కాదని కొందరు అభిప్రాయ పడుతున్నారు.



సోదరీ సోదర బంధానికి ప్రతీక

రక్షాబంధన్

- నేడు రాఖీ పౌర్ణమి...ఆలయాల్లో పూజలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 : శ్రావణ పౌర్ణమి వెన్నెలలా అందరి జీవితాలు నిండుగా శోభించాలని, సుఖ సంతోషాలతో వెల్లివిరియాలని కోరుకుంటారు. ముఖ్యంగా దీనిని రాఖీ పౌర్ణమిగా జరుపుకుంటారు. అన్నా తమ్ముళ్ల బాగుండాలని అక్కా చెల్లెళ్ల రాఖీ కట్టడం, తీయని బహుమతులు పొందడం ఆచారం. చిన్న పిల్లల నుండి అందరూ ఈ వేడుకను ఇష్టంగా జరుపుకుంటారు. భారతీయ సనాతన ఆచారాల్లో రక్షాబంధనానికి విశేష ప్రాముఖ్యత వుంది. మతాలకతీతంగా రాఖీ పౌర్ణమిను జరుపుకోవడం ఆనవాయితీ. రక్షా బంధనం సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని భారతీయుల నమ్మకం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రాఖీ పౌర్ణిమ వేడుకలు నేడు సోమవారం జరగనున్నందున జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. ఏడాదిలో ఒక్క రోజు మాత్రమే ఉపయోగించే రాఖీల వ్యాపారంతో దుకాణాలు సందడిగా మారాయి.



సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

- ధ్వజారోహణతో నాంది పలికిన పీఠాధిపతి
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ



గోపూజ చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 18: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి మహా ముఖ ద్వారంపై ధ్వజారోహణలో భాగంగా జెండాను ఆవిష్కరించి 353వ ఉత్సవాలకు నాంది పలికారు. యోగీంద్ర కళామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలకు జ్యోతి ప్రజ్వలన చేసి పీఠాధిపతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు గోపూజ, అశ్వపూజ, లక్ష్మి పూజ చేశారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏఏవో, మేనేజర్లు, క్యాష్ సెక్షన్, ఇంజనీర్ సెక్షన్, వీఆర్వో, పీఆర్వో సెక్షన్ కార్యాలయాలకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి అక్కడ ఉన్న అధికారులను ఆశీర్వదించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల నిర్వహించి ధాన్య పూజ చేశారు. ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, రజిత గజ వాహనం, బంగారు, నవరత్నాల రథంపై ఊరేగించిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి మొదటి రోజు ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆరాధనోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగళూరుకు చెందిన రూపశ్రీ ప్రభంజనచే దాసవాని సాహిత్యం, నెల్లూరు చెందిన దేవతా సిస్టర్స్ వారిచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది. ఉత్సవాలు ప్రారంభమైన ఆదివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన డీఐజీ జయలక్ష్మి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సీఆర్‌వోలు విజయేంద్రాచార్, స్కెచ్ రాఘవేంద్ర, సూపరింటెండెంట్లు రవికులకర్ణి, అనంతపురాణిక్, జేపీ స్వామి, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, బీఎం ఆనందరావు, సీఐ రామాంజులు, ఎస్ఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ: తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ ఈవో శ్యామలారావు దంపతులు రాఘవేంద్ర స్వామికి పట్టువస్త్రాలను తెచ్చారు. టీటీడీ నుంచి వచ్చిన అధికారులకు మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

కర్ణాటక ముఖ్యమంత్రి పర్యటన రద్దు : ఈ నెల 19న రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా రావాల్సిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పర్యటన రద్దు అయినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావులు తెలిపారు.





ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

జీజీహెచ్‌కు తొలగిన కరెంట్ కష్టాలు

- పెద్దాసుపత్రిలో కరెంటు కష్టాల నివారణకు కొత్తగా 11 కేవీ ఏబీ స్విచ్ ఏర్పాటు



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 18: కర్నూలు జీజీహెచ్‌లో కరెంట్ కష్టాలు తీరాయి. గత 30 ఏళ్లుగా నెలకొన్న సమస్యను ఆదివారం విద్యుత్ అధికారులు పరిష్కరించారు. ఆసుపత్రిలో 33 కేవీ సబ్ స్టేషన్ నుంచి హైటెన్షన్ లైన్ ద్వారా కరెంటు ఆసుపత్రిలోకి ట్విల్టింగ్ ఏబీ స్విచ్ ద్వారా పవర్ సరఫరా అయ్యేది. ఆసుపత్రిలో ఉండే స్టేషన్‌కే కాకుండా బయట ఉన్న 33 కేవీ సబ్ స్టేషన్‌కు కూడా కరెంటు సరఫరా జరిగి తరచూ ట్రిప్ అయ్యేది. దీని వల్ల నగరంలోని బుధవారపేట, కలెక్టరేట్, రాజ్‌విహార్ మిగతా చోట్ల కరెంటు పోయేది. దీంతో ఏ ప్రాంతంలో ట్రిప్ అయిందో తెలుసుకోవడం ఏపీఎస్ఈబీ ఇంజనీర్‌కు తలకు మించిన భారంగా ఉండేది. ఈ సమస్యను ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్ జాన్ బెర్నెడ్ శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. విషయాన్ని ఏపీఎస్‌పీడీసీ ఈఈ శివకుమార్‌కు వివరించి పనులు వేగవంతం చేయాలని సూపరింటెండెంట్ కోరారు. దీంతో ఆసుపత్రి ఏపీఎంఎస్ఐడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ శివలింగం రంగంలోకి దిగారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఇంజనీర్ పనులు ప్రారంభించారు. హారిజాంటల్ ఏబీ స్విచ్‌కు మార్చడంతో సమస్య పరిష్కారమైంది. దీని వల్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. అంతేగాకుండా బుధవారపేట, కలెక్టరేట్ ఏరియాలకు కూడా కరెంటు సరఫరాలో అంతరాయం తగ్గుతుందన్నారు. ఇందుకు సహకరించిన ఏపీఎస్ఈడీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కాంట్రాక్టు కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఎర్తింగ్ పనులు కూడా పూర్తి చేశామని చెప్పారు. ఎక్స్‌రే మిషన్లను సోమవారం ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ వెల్లడించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 18: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

పాఠశాల మార్పును ఒప్పుకోం

ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆలూరు, ఆగస్టు 18: ఆలూరు గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తుగ్గలి ఆశ్రమ పాఠశాలకు మార్పు చేయడాన్ని ఒప్పుకోమని విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. పాఠశాల మార్పునకు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి భార్గవి ఉత్తర్వులు జారీ చేయడంతో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఆలూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో 2016లో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కొనసాగిస్తున్నారు. బాలిక హాస్టల్ పక్కనే బాలుర హాస్టల్ ఉండటం వల్ల బాలికలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రవి గౌడ్ అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రభుత్వం స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ఒప్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి స్కూల్ మార్పు గురించి వివరించగా అందుకు వారు ఒప్పుకోలేదు. పాఠశాలను తుగ్గలికి తరలిస్తే అంత దూరం తమ పిల్లలను పంపించలేమని, ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని నేరణికి తండాకు చెందిన జమ్ము నాయక్‌తోపాటు పలువురు పేర్కొన్నారు. దీంతో ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాహిని తెలిపారు.

టీడీపీ నుంచి బీజేపీలో చేరిక



ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ నాయకులు

ఆదోని, ఆగస్టు 18: ఆదోని పట్టణంలోని బాబాజీ పేట 2వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బంకు మునెప్ప, బెల్లల రామాంజి, డాన్స్ మాస్టర్ వీరేష్‌తో పాటు వంద మందికిపైగా ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పార్టీ కండువా కప్పి సాదారణంగా ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు ఒక్కసారిగా బీజేపీలో చేరడంపై అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసినట్లు అదే పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు వాపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాయకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా, పార్టీ మారని మీరు ఇప్పుడు బీజేపీలో చేరడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆదోనిలో ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ పార్థసారథి తన పార్టీ బీజేపీని బలోపేతం కోసం వైసీపీ నాయకులను, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో చేర్చుకుంటూ వచ్చారు. తాజాగా టీడీపీపై దృష్టి సారించి సీనన్న నాయకులను సైతం చేర్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. గత నెల రోజులుగా బీజేపీ, టీడీపీ మధ్య అంతర్గతంగా వార్ జరుగుతోంది. ఏపీలో అధికారంలోకి కూటమి ప్రభుత్వ వచ్చినా ఆదోనిలో మాత్రం కూటమి బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తున్నారని, ఎక్కడ కూడా కార్యక్రమాలకు పిలవకుండానే స్వతహాగా వెళ్లి ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని, ఆగస్టు 15వ తేదీన మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తన ఆవేదనను వెలగక్కిన విషయం పాఠకులకు విదితమే. అదే కోవలోనే ఎమ్మెల్యే పార్థసారథి సైతం మీనాక్షి నాయుడుపై ఒంటెద్దు పోకడ అవలంబిస్తున్నాడని ఆరోపించడం అప్పుడు చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆదోనిలో ఉన్న టీడీపీ కార్యకర్తలు, నాయకులుపై దౌర్జన్యాలు, దాడులు చేసిన వారిని ఎలా బీజేపీలోకి చేర్చుకుంటారని బహిరంగంగా టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయినా ఎమ్మెల్యే పార్థసారథి మాత్రం తన పార్టీ బలోపేతం చేసుకునేందుకు తప్పడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీని బలహీనం చేసే క్రమంలోనే ఆ పార్టీ నాయకులను బీజేపీలోకి చేర్చుకుంటున్నట్లు ప్రధానంగా చర్చ జరుగుతోంది. దీనిపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓర్వకల్లు పొదుపు మహిళలు ఆదర్శప్రాయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డా.బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, ఆగస్టు 18: ఓర్వకల్లు మండల పొదుపు మహిళలు ఆదర్శప్రాయులు అని డా. బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గ్రామ సేవా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా నంద్యాల పార్లమెంటు ఎంపీ డా. బైరెడ్డి శబరి, మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి హాజరయ్యారు. అంతకుముందు ఎంపికి పొదుపు మహిళలు, బైరెడ్డి అభిమానులు భారీ సంఖ్యలో హాజరై మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి మాట్లాడుతూ మండలంలో 1279 సంఘాలు, 12,008 మంది పొదుపు సభ్యులతో మండల ఐక్యసంఘం రూ.35 కోట్ల టర్నోవర్‌లో ఉందన్నారు. గ్రామంలో ప్రజలు సమస్యలను శబరి దృష్టికి తీసుకెళ్లారు. వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రోడ్డు, ఎర్రపొలాల బుడాలు, దిక్కు పొలాలకు రైతులు వెళ్లడానికి రస్తా లేదని, అలాగే తాగునీటి సమస్య, పైపులైన్, కమ్యూనిటీ టాయిలెట్లు, సీసీ రోడ్లు, జూనియర్ కళాశాల, హంద్రీనీవా కాలువ నీటిని అందించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, ఏపీఎం లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు మధుమోహన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహబూబ్ బాషా, బీడీల శ్రీనివాసులు, ఎల్లారాముడు, ఆనందరావు, పద్మనాభం, పొదుపులక్ష్మి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివవరంలో వైసీపీ నాయకుడి మాయాజాలం

- తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వైనం
- నకిలీ ఇంటి పట్టాతో ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- మహిళల మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం



చిన్న సుబ్బారెడ్డి

అవుకు, ఆగస్టు 18 : నంద్యాల జిల్లా అవుకు మండలం శివవరం గ్రామంలోని వైసీపీ నాయకుడు వ్యాపర్ల చిన్నసుబ్బారెడ్డి.. తహసీల్దార్ పోతుల ప్రసాద్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఉదంతం కలకలం రేపుతోంది. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు పలు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమించుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటి వెలుగు చూస్తుండటంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ స్థలం ఆక్రమణకు సంబంధించి ఈ ఏడాది జూన్ నెల 21వతేదీన సామూహిక మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం అచ్చయింది. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ప్రసాద్‌బాబు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో చిన్న సుబ్బారెడ్డితో పాటు నకిలీ పట్టా పొందిన గుత్తి లలితమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు ఈనెల 17వ తేదీన ఇరువురిని రిమాండుకు తరలించారు. శివవరం గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలోని మహిళల సామూహిక మరుగుదొడ్డిపై చిన్న సుబ్బారెడ్డి కన్ను పడింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటం, ఆయన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ముఖ్య అనుచరుడు కావటం, దీనికి తోడు తమ ఇంట్లోని వ్యక్తే గ్రామ సర్పంచు కావడంతో ఇక తనకు అడ్డే లేదని చిన్నసుబ్బారెడ్డి రెచ్చిపోయాడు. 2023 మేనెల 16వతేదీన తహసీల్దార్ ప్రసాద్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేసి తన ఇంట్లో పని మనిషి గుత్తి లలితమ్మ పేరుతో నకిలీ ఇంటి పట్టాను సృష్టించాడు. గుత్తి లలితమ్మ నకిలీ ఇంటి పట్టాను అడ్డం పెట్టుకొని మహిళల సామూహిక మరుగుదొడ్డిని కూల్చి వేసి ఏకంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. ఈ ఏడాది జూన్ నెలలో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద నీళ్ల చెంబులతో నిరసనకు దిగారు. శివవరం అత్యంత సమస్యాత్మక గ్రామం కావటంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాల మహిళలను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంటి పట్టా వ్యవహారంపై రెవెన్యూ అధికారులను పోలీసులు విచారించారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ప్రసాద్‌బాబు తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుదీర్ఘంగా విచారణ జరిపిన పోలీసులు వ్యాపర్ల చిన్న సుబ్బారెడ్డితో పాటు నకిలీ పట్టా పొందిన గుత్తి లలితమ్మను రిమాండుకు తరలించారు.



గుత్తి లలితమ్మ పేరుతో సృష్టించిన నకిలీ పట్టా

మోదీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: దేశ ప్రధాని మోదీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని హోటల్ మౌర్యఇన్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రతికూల ప్రభుత్వాలపై కక్ష సాధింపు ధోరణి ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర గవర్నర్‌ను విచారణకు ఆదేశించడమంటే ఆ రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సతీమణికి సంబంధించిన భూమి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అభివృద్ధి అవసరాలకు వినియోగించారని, అందుకు ప్రతిఫలంగా మరో ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిందని భూములు తెలిపారు. ఇదే విధానంలో ఏపీ రాజధాని అమరావతికి రైతులు భూములు ఇచ్చారని, అందుకు ప్రతిగా మరో ప్రాంతంలో భూ కేటాయింపులు జరిగాయని గుర్తు చేశారు. కర్ణాటకలోని భూ కేటాయింపులో ఎలాంటి స్వలాభాపేక్ష కనిపించడం లేదని అన్నారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని రాష్ట్రాల హక్కులను హరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ ఇలాంటి రాజకీయాలు చేసే బదులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి, గవర్నర్లతో పరిపాలన చేయించుకోవాలని విమర్శించారు. కర్ణాటక సీఎంపై ఇచ్చిన ఆదేశాలు ఉపసంహరించుకొని ఆ రాష్ట్ర గవర్నర్‌ను తక్షణమే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే తరహాలో తమిళనాడు, కేరళ, పంజాబ్ రాష్ట్రాలకు రావాల్సిన బిల్లులకు మోకాలు అడ్డువేస్తున్నారని తెలిపారు. కేంద్ర విధానాలను విభేదిస్తున్నందునే ఝార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేశారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

సమస్యను పరిష్కరించిన మంత్రి నారా లోకేశ్

- ఎక్స్‌లో పోస్టు చేసిన ఓ యువకుడు
- స్పందించిన మంత్రి
- 24 గంటల్లో సమస్యకు పరిష్కారం



కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 18: కర్నూలు నగరానికి చెందిన ఓ యువకుడు ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసిన సమస్యను రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు 24 గంటల్లో పరిష్కరించారు. నగర శివారులో ఉల్చాల రోడ్డులోని స్కంద లోటస్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో రహదారిపై మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తున్నదని, అక్కడ నివాసముంటున్న అభిషేక్ అనే యువకుడు ఈ నెల 7న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేశారు. పది రోజులైనా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎక్స్‌లో మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేసి విషయాన్ని పోస్టు చేశాడు. స్పందించిన లోకేశ్ తన బృందంతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే ఎక్స్‌లో నగర పాలక సంస్థ స్పందించింది. అక్కడ అన్ని వైపులా ప్రహరీలు ఉండటం, మురికి, వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదు. అందువల్ల సమస్య పరిష్కరించడం ఆలస్యమైందని వివరణ ఇచ్చింది. వెంచర్‌లో సరైన ప్రధాన కాలువలు నిర్మించకపోవడంతో ఈ సమస్య పునరావృతం అవుతుందని, ఇంకా పూర్తి స్థాయిలో గృహాలు, రహదారులు, మురికి కాలువలు ఏర్పడకపోవడం వలన మురికి కాలువలకు సరైన ప్రణాళిక లేదని ఎక్స్‌లో మంత్రి దృష్టికి నగర పాలక సంస్థ తీసుకెళ్లింది. మంత్రి లోకేశ్ ఆదేశాలతో 1.70 కి.మీల వరకు కచ్చ కాలువ నిర్మించి గల్వర్ ద్వారా మురుగునీటిని తొలగించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించామని, శాశ్వత పరిష్కారానికి సర్వే చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక సంస్థ ఎక్స్‌లో వెల్లడించింది.



జీవో నెం 143ని రద్దు చేయాలి

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 18: జీవో నెం143ని రద్దు చేయాలని ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓల్డ్ సీఎల్‌జీలు కర్నూలు, నంద్యాల జిల్లాల తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, తెలుగునాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మద్దయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్.రాఘవేంద్ర గౌడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ సీనియర్ ఏఎన్‌ఎంల రిడిప్లాయ్‌మెంటును రద్దు చేసి వారి యథా స్థానాలకు పంపించాలని, ఏఎన్‌ఎం టూ జీఎన్‌ఎం ఇక్షణ చేసిన వారిని రిలీవ్ చేసి పదోన్నతుల్లో న్యాయం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సాధారణ బదిలీలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను ప్రక్రియను పూర్తి చేయాలని 12 పీఆర్‌సీని వీలైనంత వరకు ప్రకటించి అమలు చేసేలోపు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ నర్సెస్ అసోసియేషన్ నాయకురాలు శాంతిభవాని, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.నాగరాజు

జిల్లా అధ్యక్షుడిగా ఎ. మాధవరాజు ఎన్నిక: అనంతరం తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా కేఎంసీలో ఎంపీహెచ్‌ఎస్ (ఎం)గా పని చేస్తున్న ఎ. మాధవరాజు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.బంగారి (స్టాఫ్ నర్సు జీజీహెచ్)ని ఎన్నుకున్నారు.

ఉత్సవాల్లో నేటి పూజలు



మంత్రాలయం, ఆగస్టు 18: రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధన మహోత్సవాల్లో జరిగే రెండో రోజు సోమవారం జరిగే పూజా కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

- తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం
- అనంతరం 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం
- ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రహ్లాదరాయలకు పాదపూజ, పంచామృతాభిషేకం
- ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- అనంతరం యజుర్వేద నిత్య నూతన ఉపకర్మ పూజలు
- 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ
- 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు
- సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం
- రాత్రి 8.30 గంటలకు రథోత్సవాలు, శాకోత్సవం, ఊంజల సేవ, రజిత మంటపోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాలు

సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు మైసూరు చెందిన నాదహరి సంగీత బృంద వాయిద్య సంగీతాలు, 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు బెంగళూరుకు చెందిన పుత్తూరు నరసింహ నాయక్‌చే దాసవాని సాహిత్యం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు పుత్తూరుకు చెందిన నృత్యపాసన అకాడమి వారిచే నృత్యాలు భక్తులను ఆకట్టుకోనున్నాయి.

ఆదోని సబ్ కలెక్టర్ బదిలీ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 18: ఆదోని సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న శివ్ నారాయణశర్మను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

సొసైటీ చైర్మన్ పదవి ఎవరికో..?

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దగ్గరికి చేరిన పంచాయితీ



శీనప్ప



మోహన్

మద్దికెర, ఆగస్టు 18: ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్లు దృష్టి సారించారు. మండలంలోని బురుజుల గ్రామంలో విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ పదవిపై నేతల మధ్య పోటీ నెలకొనడంతో ఈ పంచాయతీ కాస్త ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వద్దకు చేరింది. మండలంలో బురుజుల గ్రామ సొసైటీ పరిధిలోకి హోసూరు, మొలగవెల్లి, మొలగవెల్లి కొట్టాల గ్రామాలు వస్తాయి. ఈ సహకార సంఘంలో దాదాపు 1140 మంది సభ్యులు పది కోట్ల మేర లావాదేవీలు ఉన్నాయి. ఈ సహకార సంఘం చైర్మన్‌పై పలువురు ఆశ పెట్టుకున్నారు. గ్రామానికి చెందిన నమ్మారి మోహన్ టీడీపీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నానని, ఏనాడూ కూడా పార్టీ మారలేదని, ఆ చైర్మన్ పదవి నాకు ఇవ్వాలని కోరుతున్నారు. కార్యకర్తలా పని చేస్తూ వచ్చానని, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దర్శి శ్రీనివాసనాయుడు, సొసైటీ భవనం కోసం తన తండ్రి దర్శి వెంకట్‌నాయుడు 20 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చాడని, ఏనాడూ కూడా ఈ పదవి ఆశించలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేశారని, అందువల్ల ఈ పదవి నాకు ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. అలాగే గ్రామంలో మరో ఇద్దరు కూడా ఈ చైర్మన్ పదవిపై దృష్టి సారించారని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో సహకార సంఘానికి ఎన్నికలు జరిగాయి. జగన్ ప్రభుత్వంలో సొసైటీ ఎన్నికలు జరగకుండా నామినేటెడ్ పోస్టులుగా మార్చి ఇస్తూ వచ్చారు. దీంతో ఈ పదవిపై ఆశావాహులు ఆశలు పెంచుకున్నారు. ఎవరికి ఈ పదవి వరిస్తుందో వేచి చూడాల్సిందే. నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది.

ఆధిపత్యం కోసమే వాకిటి హత్య

వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి డీఎస్పీ

పత్తికొండ, ఆగస్టు 18: ఆధిపత్య పోరులో భాగంగానే హోసూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యకు గురైనట్టు తేలింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆదివారం వెల్లడించారు. హోసూరు గ్రామానికి చెందిన వాకిటి శ్రీనివాసులు టీడీపీ నాయకుడిగా గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్ గుడిసె నరసింహులు రాజకీయంగా తన ఎదుగుదలకు వాకిటి శ్రీనివాసులు అడ్డు వస్తున్నాడని భావిస్తూ వచ్చాడు. ఇందులోభాగంగానే తన అనుచరులు బోయ రామాంజనేయులు, ఉలినేని హరికృష్ణలతో కలిసి వాకిటి శ్రీనివాసులు ఆధిపత్యం ఎలా తగ్గించాలన్న అంశంపై చర్చించేవాడు. అతడిని అంతమొందించడమే మార్గంగా ముగ్గురు అభిప్రాయానికి వచ్చారు. ఇందుకోసం గ్రామానికి చెందిన వడ్డె నరసింహులుతో హత్య చేయడానికి పథకం రచించారు. మైనర్ అయిన తన అల్లుడు, అతని స్నేహితుని ద్వారా హత్య చేయిస్తానని అందుకోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని వడ్డె నరసింహులు వారికి చెప్పాడు. దీంతో ఆ మొత్తం ఇచ్చేందుకు ముగ్గురు అంగీకరించి రూ.50 వేలు అడ్వాన్సు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం వడ్డె నరసింహులు అల్లుడు, అతని స్నేహితుని ద్వారా వాకిటి శ్రీనివాసులు హత్య చేసేందుకు పథకం రచించి రెక్కీలు నిర్వహించాడు. పథకం ప్రకారం ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన వాకిటి శ్రీనివాసులు కళ్లలో కారం చల్లారు. అనంతరం తలవెనుక ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతోపాటు కత్తితో పలుమార్లు దాడి చేయడంతో వాకిటి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య కేసు నమోదు చేసుకున్న పత్తికొండ సీఐ జయన్న అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. గ్రామధిపత్యం కోసమే హత్య జరిగిందని నిర్ధారణకు వచ్చి అనుమానితులుగా ఉన్న గుడిసె నరసింహులు, బోయ రామాంజనేయులు, ఉలినేని హరికృష్ణ, వడ్డె నరసింహులుతోపాటు ఇద్దరు మైనర్లపై నిఘా ఉంచారు. ఆదివారం పుచ్చకాయలమాడ క్రాస్ రోడ్డు వద్ద వీరిని అరెస్టు చేశారు. నలుగురిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. కేసు దర్యాప్తులో దేవనకొండ సీఐ శ్రీనివాసులు, పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ హేమ్లా నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

మహానందిలో శ్రావణ మాస శోభ

● భక్తులతో కిటకిటలాడిన క్షేత్రం ● దర్శించుకున్న ప్రముఖులు



ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు



మహానందిలో దర్శనం కోసం క్యూలో నిల్చొన్న భక్తులు

మహానంది, ఆగస్టు 18: మహానంది క్షేత్రం శ్రావణమాస శోభతో కళకళలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు వివాహాలకు మంచి ముహూర్తం ఉండటంతో పదుల సంఖ్యలో నూతన జంటలు ఒక్కటయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు శనివారం రాత్రే మహానందికి చేరుకోవడం జరిగింది. తెల్లవారుజాముననే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పరమశివుని దర్శనం కోసం క్యూలో నిల్చొవడం జరిగింది. కాగా శ్రావణమాసంలో పెళ్ళిళ్లలకు మంచి ముహూర్తం ఉండటంతో పెళ్లిళ్ళు అధికంగా జరిగాయి. దీంతో మహానందిలో అటు భక్తుల సందడి,ఇటు పెళ్ళి బృందాల కోలాహలంతో నిండిపోయింది. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కల్గకుండా ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయంలో పర్యవేక్షించించడం జరిగింది.

ఎస్‌బీఐ డీజీఎం పూజలు

మహానంది క్షేత్రంలో ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాహుల్ సంక్రేత్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు డీజీఎం అభిషేకార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించారు. ఏఈవో శాలువాతో సన్మానించారు. వీరివెంట ఏజీఎం రాజశేఖర్, మేనేజర్లు శ్రీవత్స, కేశవ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహానంది వ్యవసాయ కళాశాలకు 31 ఏళ్లు



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల ప్రాంగణం

మహానంది, ఆగస్టు 18: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేసి నేటికి 31 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నట్లు కళాశాల సిబ్బంది ఆదివారం తెలిపారు. 1993లో అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహరావు మహానంది వ్యవసాయ కళాశాలను స్థాపించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇందులోని 450 ఎకరాల్లో వ్యవసాయ కళాశాల, ఉద్యానవన పరిశోధన స్థానంతో పాటు పశు పరిశోధన స్థానం ఏర్పాటు చేసారు. ఇప్పటి వరకు ఎందరో విద్యావంతుల్ని శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను చేసిన ఘనత కళాశాలకు దక్కుతోంది. అలాగే వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో ఇక్కడ వ్యవసాయ కోర్సు చేసిన విద్యార్థులు ఉన్నత పదవుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న డా. సరస్వతి

నందికొట్కూరు, ఆగస్టు 18: నందికొట్కూరు పట్టణంలోని సెయింట్ మేరిస్ హైస్కూల్‌లో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 1000 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ముఖ్యంగా జీర్ణకోశ, కాలేయ వ్యాధులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, జనరల్ సర్జరి, జనల్ మెడిసిన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. నందికొట్కూరుకు చెందిన నరసన్న గౌడ్ కుమార్తె డా.సరస్వతి విదేశాల్లో వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. తన సొంత పట్టణమైన నందికొట్కూరు ప్రజలకు వైద్య పరీక్షలు చేయాలన్న ఉద్దేశంతో మన అమెరికా తెలుగు అసోషియేషన్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అమెరికాకు చెందిన డా.సర్వసతి, ఆర్థోపెడిక్ విజయభాస్కర్, పీడియాట్రిక్ డా.సాయి ప్రసాద్, డా.శ్రీదేవి, జనరల్ సర్జన్ డా.రవీంద్ర వైద్యసేవలు అందించారు.

'ఏకపక్షంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు'

కొత్తపల్లి, ఆగస్టు 18: మండలంలోని చిన్నగుమ్మడాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని, అందుకు బాధ్యులైన కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని చిన్నగుమ్మడాపురం గ్రామానికి చెందిన ఏ.దర్గయ్య, హరికృష్ణ, జి.దర్గయ్య, వెంకటేశ్వర్లు, శివన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఏడు మంది విద్యార్థులు ఉంటే వారిలో మూడు ఓట్లు చెల్లవని అధికారులే తేల్చి చెప్పారన్నారు. ఉన్న నలుగురు విద్యార్థుల్లో ఇరువర్గాల వారికి ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉన్నప్పటికీ ఒకే వర్గం పక్షన ఎంఈవో నిలబడి ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంఈవో-2 ఇనయతుల్లాను వివరణ కోరగా.. ఎన్నికలు సజావుగా జరిగాయని, ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించలేదని చెప్పారు. కావాలనే వారు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

నంద్యాల క్రైం, ఆగస్టు 18: తప్పిపోయిన బాలుడిని గంటల వ్యవధిలో పోలీసులు కనిపెట్టి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన ఘటన ఆదివారం నంద్యాలలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు జలకనూరు గ్రామానికి చెందిన మద్దయ్య కుమారుడు హేమంత్‌కుమార్ నంద్యాలలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. హేమంత్‌కుమార్ తన మేనమామతో కలిసి కర్నూలుకు వెళ్లి అనంతరం తిరిగి నంద్యాల బస్టాండ్‌లో దిగారు. హేమంత్‌కుమార్ బహిర్భూమికి వెళ్లాలని మేనమామతో చెప్పి బయటకు వెళ్లి తప్పిపోయాడు. మేనల్లుడు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన మేనమామ బాలుడి ఆచూకీ కోసం బస్టాండ్ పరిసరాల్లో గాలించి అనంతరం నంద్యాల కమాండ్ కంట్రోల్ రూమ్ పోలీసులను సంప్రదించాడు. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా మేనమామ అభ్యర్థన మేరకు కంట్రోల్ రూమ్ పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి బస్టాండ్ ఏరియా, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా బాలుడిని కనుగొని కుటుంబసభ్యులకు అప్పగించారు. గంటల వ్యవధిలో నంద్యాల పోలీసులు తప్పిపోయిన బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో మేనమామతోపాటు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలంలో ముగిసిన ద్విశతావధానం



ముగింపు కార్యక్రమంలో అపర్ణ

శ్రీశైలం, ఆగస్టు 18: శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రావణమాసోత్సవాల సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా, భీమడోలుకు చెందిన బులుసు అపర్ణచే ఈ నెల 14వ తేదీ ప్రారంభించిన ద్విశతావధానం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆలయ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై "అవధాన కవితా నీరాజనం" పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధులైన 60 మంది కవిపండితులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి విశిష్ట అతిథిగా ఆచార్య జి.ఎస్. కృష్ణమూర్తి, వైస్ చాన్సలర్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి వారు విచ్చేశారు. కార్యక్రమం ముగింపులో అవధాని, విశిష్ట అతిథులు, పృచ్ఛకులు, వ్యవహరించిన కవిపండితులందరికీ వేదాశీర్వచనంతో స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు గిరిజామణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి 1,01,463 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 18: శ్రీశైలం జలాశయానికి ఆదివారం ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 40,157 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 61,306 క్యూసెక్కులు మొత్తం 1,01,463 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 881.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 193.4090 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,849 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,681 క్యూసెక్కుల మొత్తం 68,530 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

నేడు మహాలక్ష్మి యాగం



మహాలక్ష్మి యాగానికి సిద్ధంగా ఉన్న హోమగుండాలు

మహానంది, ఆగస్టు 18: శ్రావణ పౌర్ణమి పురష్కరించుకొని మహానంది మండలం గాజులపల్లి ఆర్‌ఎస్‌లోని మరకత లింగేశ్వరుని ఆలయంలో సోమవారం మహాలక్ష్మి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు, ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్మాణకర్త కనుమర్లపూడి మస్తాన్‌రావు ఆదివారం తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు యాగంలో పాల్గొంటారని చెప్పారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లల్లో భాగంగా ఆలయ పరిసరాల్లో హోమగుండాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోక కల్యాణార్థం మరకతలింగేశ్వరుని సన్నిధిలో మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

'బాల్య వివాహాలు నేరం'



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 18: బాల్య వివాహాలు నేరమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యురాలు రాజేశ్వరమ్మ అన్నారు. మాతా శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు కైలాస్ సత్యాపి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నందమూరి నగర్‌లోని స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు లేని భారత్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నందమూరి నగర్‌లో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్టార్ సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రోగ్రామ్ చీఫ్ కోఆర్డినేటర్ మహంకాళి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్ సీఐగా సురేష్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 18: ఆత్మకూరు రూరల్ సీఐగా సురేష్‌కుమార్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ రూరల్ సీఐగా పనిచేస్తున్న నాగభూషణ్ బదిలీపై కడప జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో వెల్దుర్తి సీఐగా పనిచేస్తున్న సురేష్‌కుమార్ రెడ్డి ఇక్కడికి వచ్చారు. గతంలో నంద్యాల త్రీటౌన్, ఆత్మకూరు, చాగలమర్రి పోలీసుస్టేషన్లలో ఎస్‌గా పని చేశారు. ఆ తర్వాత సీఐగా పదోన్నతి పొంది ట్రాన్స్‌కో, బనగానపల్లె, ఇంటెలిజెన్సీ, వెల్దుర్తిలో సీఐగా పని చేస్తూ ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆత్మకూరు రూరల్ సీఐగా వచ్చారు 2008 నుంచి 2011 వరకు ఆత్మకూరు ఎస్ఐగా పని చేశారు. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిని వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

తమ్ముడి చేతిలో అన్న హత్య

వెలుగోడు, ఆగస్టు 18: అన్నను తమ్ముడు హత్య చేశాడు. ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోతుకూరు గ్రామ బీసీ కాలనీలో పసుపుల మల్లికార్జున (40), అతని తమ్ముడు పసుపుల శ్రీనివాసులు నివాసం ఉంటున్నారు. వీరు మద్యానికి బానిసయ్యారు. శనివారం రాత్రి సైతం ఇద్దరు కలిసి మద్యం తాగారు. తాగిన మైకంలో ఇరువురి మధ్య మాట మాట పెరిగింది. ఈ నేపథ్యంలో అన్న మల్లికార్జునపై తమ్ముడు శ్రీనివాసులు రోకలి బండతో కొట్టి హత్య చేశాడు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి అన్నను హత్య చేశానని సమాచారం ఇచ్చాడు. మృతుడి తల్లి బాలనాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గొడవలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



గోకవరంలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

కొత్తపల్లి, ఆగస్టు 18: గామీణ ప్రాంతాల్లో చిన్నపాటి విషయాలకు కూడా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. ఆదివారం డీఎస్పీ కొత్తపల్లి మండలం గోకవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న స్థల వివాద సమస్యపై విచారించారు. గ్రామానికి చెందిన స్వామి యేసు అనే వ్యక్తికి ఎస్సీ కాలనీవాసులకు ఓ స్థల విషయంలో గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతోంది. ఈ విషయాన్ని స్థానిక పోలీసుల ద్వారా తెలుసుకున్న డీఎస్పీ రామాంజినాయక్ నేరుగా గోకవరం వెళ్లి ఇరువర్గాల మధ్య నెలకొన్న సమస్యను విచారించారు. ఆయన వెంట ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్, సిబ్బంది ఉన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

ఆత్మకూరు, ఆగస్టు 18: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నంద్యాల జిల్లా కార్యవాహ విప్రనారాయణాచారీ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక జి.పుల్లారెడ్డి స్కూల్‌లో నిర్వహించిన రక్షాబంధన్ ఉత్సవాన్ని పురస్కరించుకుని వక్తగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. సకల ప్రాణులకు జీవనాధారంగా ప్రకృతి ఎంతగానో ఉపకరిస్తుందని, అయితే అలాంటి మనిషి చేస్తే నిర్లక్ష్యం కారణంగా నానాటికి ఛిద్రమవుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ప్రపంచమే ప్రమాదంలో పడనుందని వివరించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నీటిని పొదుపుగా వాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే ప్రపంచానికి పెనుసవాళ్లగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంతవరకు తగ్గించాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ - గ్రామ పరివర్తనా కార్యము కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఖండ కార్యవాహ వాసుదేవరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'విద్యార్థి బస్సు నడపాలి'

కొత్తపల్లి, ఆగస్టు 18: ఆత్మకూరు ఆర్టీసీ అధికారులు విద్యార్థుల కోసం సాయంత్రం ఎర్రమటం వరకు బస్సు సర్వీసును పాతమాడుగుల వరకు పొడిగించాలని గ్రామ నాయకులు సీలం లింగన్న, వెంకటస్వామి, తెలుగు అశోక్, శేషన్న, లక్ష్మన్న ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని పాతమాడుగుల గ్రామనికి చెందిన విద్యా ర్థులు ఆత్మకూరు పట్టణంలోని వివిధ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నా రని చెప్పారు. వీరు సాయంత్రం ఆత్మకూరు నుంచి ఎర్రమటం వరకే బస్సు నడ పడం వల్ల అక్కడి నుంచి 2 కి.మీ.ల మేర పాతమాడుగుల వరకు విద్యార్థులు నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ విషయం ఆత్మకూరు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఎర్రమటం నుంచి పాతమాడుగుల వరకు బస్సు సర్వీసును పొడిగించే విదంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

22, 23 తేదీల్లో ఫుడ్ కోర్టులకు వేలం పాట

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 18: నంద్యాల జిల్లాలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలో గల ఫుడ్ కోర్టు, పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో అసంపూర్తిగా నిర్మాణంలోనున్న కట్టడాన్ని జిల్లా పర్యాటక శాఖ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముచ్చుమర్రిలోని నిర్మాణ కట్టడాన్ని ఈ నెల22వ తేదీన, సంగమేశ్వరంలోని ఫుడ్‌కోర్టును ఈనెల 23వ తేదీన కలెక్టరేట్లోని పర్యాటక శాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు రూ.5వేలు ధరావత్తు జిల్లా కలెక్టర్, చైర్మన్ జిల్లా పర్యాటక మండలి వారి పేరుమీద చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు 7995087089,8297098022 నెంబర్లు సంప్రదించవచ్చునని టూరిజం అధికారి ప్రకటనలో తెలిపారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 18: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై ఇలాంటి ఘటనలకు ప్పాలడటం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని అన్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు కఠినమైన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా నాయకులు పుల్లయ్య రవి, పవన్‌కుమార్, జయరాం, వెంకటేశ్వర్లు, తదిరతులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూరు: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా నగరంలో గల ఆర్‌జీకార్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యను నిరసిస్తూ ఆదివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రజాసంఘాల నాయకులు రామ్‌నాయక్, స్వాములు, రణధీర్, వీరన్న, భాస్కర్, కిరణ్, కిష్టఫర్, శివయ్య, భాస్కర్, రామకృష్ణ, శివ తదితరులు ఉన్నారు.

నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్కేప్ చానల్‌కు వెళ్తున్న నీరు

పాములపాడు, ఆగస్టు 18: మండలంలోని బానకచెర్ల క్రాస్‌హెడ్ రెగ్యులేటరు నుంచి 28వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలుగుంగ ఏఈ దేవేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 28వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో వాటిని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగకు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. అలాగే ఎస్కేప్ చానల్‌కు 4వేలు, జీఎన్ఎస్ఎస్‌కు 14వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలి'



ఆత్మకూరులో విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 17: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరదను జాతీయ విపత్తుగా పరిగణించి కేంద్ర ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రజాక్, రణధీర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, గణపతి, రవి, చాంద్, బాషా, కలీముల్లా, విజయ్, జబీవుల్లా తదితరులు ఉన్నారు.

'సత్ప్రవర్తనతో జీవించాలి'

నంద్యాల క్రైం, ఆగస్టు 18: సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలంటూ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులకు పోలీసులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగా నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వారిని కూడా స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు ప్రస్తుతం జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంచామని, నేర ప్రవృత్తిని విడనాడకుంటే కఠిన చర్యలు తప్పవని హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను పోలీస్ అధికారులు హెచ్చరించారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 18: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మోహన్ కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరిట ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని అన్ని పంచాయతీల్లో మురుగు గుంటలు శుభ్రం చేయడం, రహదారులపై నిలువ నీరు ఉండకుండా చూడటం, తాగునీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రత లేకుండా చూడటం, తాగునీటి క్లోరినేషన్ వంటి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు అన్ని గ్రామ పంచాయతీలలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు ప్రబలకుండా, కుంటలలో దోమలు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.

ఏపీజీఈఏ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన ఏపీజీఈఏ నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 18: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) నందికొట్కూరు తాలుకా అధ్యక్షుడిగా కె.బాలరాజుతో సహా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల అధికారిగా శ్రీహరి, సహాయ ఎన్నికల అధికారిగా శ్రీనివాసులు వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా ఏపీజీఈఏ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రప్ప, తిరుపాలయ్య వ్యవహరించారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ నందికొట్కూరు తాలుకా ఎన్నికల్లో 19 స్థానాలకు పోటీ నిర్వహించగా 19 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. ఏపీజీఈఏ తాలుకా అధ్యక్షుడిగా బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నర్సరాజు, సహాధ్యక్షులుగా రషీద్, కోశాధికారిగా రాముడు, ఉపాధ్యక్షులుగా భువనేశ్వరి, జగదీష్ కుమార్, రంగస్వామి, కృష్ణమూర్తి, జ్యోతి, నూరుల్లా, నాగేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా గుట్టలయ్య, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, జాఫర్, కామేశ్వరప్రసాద్, రామచంద్రయ్య, మద్దిలేటి ఆర్గనైజింగ్ సెక్రటరీగా టైపిస్టు వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు.

'రైతులకు పగటి పూట విద్యుత్ అందించాలి'



సమావేశమైన ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 18: రైతులకు 9 గంటల వ్యవసాయ విద్యుత్‌ను పగటిపూట అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరులో రైతు సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికరంలోకి వస్తే పగలే రైతులకు వ్యవసాయానికి నాణ్యమైన 9 గంటల విద్యుత్‌ను ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే సిఫ్టుల ప్రకారం విద్యుత్‌ను అందిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతూ చంద్రబాబు ఇచ్చిన హామీని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. రైతులు ఇప్పటికే వర్షాలు లేక తొమ్మిది గంటల కరెంటు కూడా సరిపోక పంటలు ఎండిపోతున్నాయని, బోరు బావుల్లో నీరు లేకపోవడంతో 9 గంటల విద్యుత్‌తోనే సరిపెట్టుకుంటున్నారని అన్నారు. ఇప్పుడు మళ్లీ కరెంటును ఫీడర్ మార్చడం వలన రాత్రి సమయాల్లో రైతులు మోటార్ల దగ్గర విద్యుత్ షాక్‌తోనూ, పాముకాటులు జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధాకర్, రాజు, మౌలాలి, మహబూబ్‌బాషా, ఇంతియాజ్, పాండురంగయ్య స్వాములు, రమణ, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీడీపీతోనే పేదల సంక్షేమం



చాగలమర్రిలో నాగదేవతలకు పూజలు చేస్తున్న నాయకులు

చాగలమర్రి, ఆగస్టు 18: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని కుమ్మరికట్ట వీధిలో ఏర్పాటు చేసిన నూతన నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా టీడీపీ, బీసీ సంఘ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలని మహిళలు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు మౌళాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, అబ్దుల్లా, ఓబులేసు, షఫి, షరిఫ్, బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 18: గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాదు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండడంతో వివిధ వ్యాధులు పశువులకు సోకే ప్రమాదం ఉందని, అధిక భాగం ఎండలో ఉంచరాదని అన్నారు. గొంతువాపు, జబ్బువాపు, గాలికుంటు, నీలి నాలుక, అంథ్రాక్స్, బ్రూసెల్లస్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులు సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం



చాగలమర్రిలో అన్నదానం చేస్తున్న దాతలు

చాగలమర్రి, ఆగస్టు 18: చాగలమర్రి గ్రామంలోని గుంత పాలెం వీధిలో శ్రావణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన నాగదేవత విగ్రహాల వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మహిళలు సామూహికంగా నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేసి వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ ప్రార్థనలు చేశారు.

అసంపూర్తిగా అదనపు గది నిర్మాణం పనులు



నాగులవరంలో అసంపూర్తిగా అదనపు గది నిర్మాణం పనులు

రుద్రవరం, ఆగస్టు 18: మండలంలోని నాగులవరం గ్రామంలో అసంపూర్తిగా అదనపు గది పనులు నిలిచిపోయాయి. ఈ పాఠశాలలో ఒక్కటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులు గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గది నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో చెరువు పంట కాలువ



ముత్యాలపాడు చెరువు వద్ద ముళ్ల కంపలతో నిండుకున్న పంట కాలువ

చాగలమర్రి, ఆగస్టు 18: మండలంలోని ముత్యాలపాడు, డి.వనిపెంట గ్రామ సమీపంలోగల చెరువుల కింద పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలువలు ముళ్ల కంపలతో నిండుకున్నాయి. చెరువు ఆయకట్టు పరిధిలో రైతులు సాగునీరు కట్టుకునేందుకు కాలువలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ముత్యాలపాడు ఎర్రచెరువు తూము సమీపంలో పంట కాలువలు అసంపూర్తిగా ఆగిపోయాయి. లైనింగ్ పనులు చేసి వదిలేశారు. ముళ్ల కంపలతో నిండుకొని చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి చెరువు కిందగల పంట కాలువల మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అనాథలకు అండగా బీసీ రాజారెడ్డి



ఆశ్రమంలో అనాథ బాలుడితో మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 18 : అనాథలకు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అండగా ఉంటున్నారని అనాథల ఆశ్రమం నిర్వాహకులు గట్టు శంకర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ గ్రామంలోని అమ్మానాన్న అనాథల ఆశ్రమాన్ని బీసీ రాజారెడ్డి సందర్శించారు. ఆశ్రమంలో ఉన్న 600 మంది అనాథలను పలకరించి ఆరోగ్య విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమానికి రూ. 3 లక్షల విలువ చేసే 100 బస్తాల నంద్యాల సోనా బియ్యాన్ని పంపుతానని ప్రకటించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనాథల ఆశ్రమానికి తనవంతు సహాయం అందిస్తానని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ పోరాటానికి ఫలితం



చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 : మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీస్ చేసిన 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గోపాల్‌గారి దస్తగిరి, తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బెలుం గ్రామం ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా నాయకులు శివనారాయణ, జయరాముడు, ప్రభాకర్, మారెన్న, తోళ్ల నాగాంజనేయ, దాసన్న, ఓబులేసు పాల్గొన్నారు.

సంక్షోభంలో ఎస్సీ హాస్టల్

- విద్యార్థులకు సదుపాయాలు కరువు
- వెంటాడుతున్న విష సర్పాల భయం
- పట్టించుకోని అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 18: హాస్టళ్లు తెరిచి రెండు నెలలు కావస్తోంది. అయితే ప్రభుత్వం హాస్టళ్లలో మౌలిక సదుపాయలు నేటి వరకు కల్పించ లేదు. దీంతో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పాత భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ భవనం పాతబడి ప్రమాదకరస్థాయికి చేరుకుంది. ఈ హాస్టల్‌లో 3 నుంచి 10వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతి గృహం లోపలి భాగంలో పైకప్పు పెచ్చులూడి పోయాయి. విద్యార్థులకు బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు సక్రమంగా లేవు. బాత్రూమ్‌ల డోర్‌లు లేక పోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. దీంతో కొళాయి నీరే తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పొలాల పక్కన హాస్టల్ భవనం ఉండటంతో విషసర్పాల భయంతో బయటకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థలో మరుగుదొడ్లు



చిన్నవంగలి ఎస్సీ హాస్టల్

- **ప్రతిపాదనలు పంపాం:** ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్‌లోని స్థితిగతులపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. హాస్టల్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని అధికారులకు తెలియజేశాం. హాస్టల్‌లోని సమస్యలపై అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

ఖాసీంవలి, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్

పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, ఆగస్టు 18: రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శివారులోని కర్నూలు రహదారిలో ఉన్న షిరిడీ సాయిబాబా కళ్యాణ మండపంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య మేనల్లుడు వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని, ఏపీ రాష్ట్రానికి రాజధాని లేని రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేయడం అవినీతి పాలన జగన్ చేయడం పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పోలూరు రాఘవరావు, తిరుమలేష్ చౌదరి, జాకీరుల్లా బేగ్, నారాయణ స్వామి, చంద్రశేఖర్, సుధాకర్, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బెలుంగుహల్లో పర్యాటకుల సందడి



కొలిమిగుండ్ల, ఆగస్టు 18 : మండలంలోని బెలుంగుహల్లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు రోజులు కావడంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు తరలివచ్చారు. సహజ సిద్ధమైన బెలుం గుహల అందాలను తిలకించారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 : కొలిమిగుండ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు ఉపాధి, తాగునీటి శాఖలకు సంభంధించిన అధికారులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో తలారీ సుంకమ్మ అనే మహిళపై దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గోవిందనాయక్ ఆదివారం తెలిపారు. కుటుంబ తగాద విషయంలో సమీప బంధువులైన గుత్తి ఓబుళమ్మ, సురేష్‌లు దాడి చేశారు. భాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెల్లడించారు.

చౌడేశ్వరి అమ్మవారికి వెండి కిరీటం



చౌడేశ్వరి మాతకు వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న భక్తులు

బనగానపల్లె, ఆగస్టు 18 : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి వెండి కిరీటాన్ని భక్తులు ఆదివారం బహూకరించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం మద్దెలపల్లె గ్రామానికి చెందిన గురుదత్త అంబటి గోవిందు వారి కుటుంబ సభ్యులు అమ్మవారి నూతన ఉత్సవమూర్తికి వెండి కిరీటం, నాగపడిగను ఆలయ కార్యనిర్వహణ అధికారి కామేశ్వరమ్మ, మాజీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి అందించారు. దాతలతో ఆలయ వేదపండితులు చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు.

చివరి మజిలీ కష్టాలు

- పలు గ్రామాల్లో శ్మశానాల ఆక్రమణ ● పట్టించుకోని అధికారులు



బ్రిడ్జి కింద శవాలను పూడ్చిపెట్టిన దృశ్యాన్ని చూపిస్తున్న గ్రామస్తుడు

ప్యాపిలి, ఆగస్టు 18: మండలంలోని పలు గ్రామాల్లో శ్మశానాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో అంత్యక్రియల కష్టాలు తీవ్రమయ్యాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రమైన ప్యాపిలిలోని రెండు శ్మశాన వాటికలు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ ఆక్రమణలు జరిగినా ఎవరూ పట్టించుకొన్న పాపన పోలేదు. మండలంలోని వెంగళాంపల్లి, ఊటకొండ, పోతుదొడ్డి, వెంకటాంపల్లి, ఎర్రగుంట్లపల్లి తదితర గ్రామాల్లో శ్మశానవాటికల సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఆక్రమణకు గురికావడంతో పాత గుంతనే తీసి అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. అదేవిధంగా ఏనుగమర్రి గ్రామంలో 2008లో 44వ జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణలో శ్మశానం ముంపుకు గురైంది. శ్మశానం కోసం వేరే ప్రాంతంలో భూమి చూపిస్తామన్న అధికారులు ఇంత వరకు చూపించలేదు. గత్యంతరం లేక జాతీయ రహదారి కల్వర్టు క్రింద ఉన్న కొద్దిపాటి స్థలంలోనే శవాలకు అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎండిపోతున్న మినుము పంట



ఎండుముఖం పట్టిన మినుము పంట

కొలిమిగుండ్ల, ఆగస్టు 18: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు ఎంతో ఆశతో సాగు చేసిన మినుము పంట వర్షం లేక పోవడంతో వాడు తగులుతోంది. గ్రామానికి చెందిన రైతులు నారాయణరెడ్డి, చెక్కా మద్దిలేటి, వరప్రసాదరెడ్డి, రామాంజనేయరెడ్డి తదితర సుమారు 20మంది రైతులు 100 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. అయితే సాగు చేసిన దగ్గర నుండి వర్షం కురవక పోవడంతో పంటలు పండుబారి వాడు తగులుతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు నేల పాలు అయినట్టేనని అన్నదాతలు వాపోతున్నారు.

సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి



శిరివెళ్లలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల, ఆగస్టు 18: రౌడీషీటర్లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వంశీధర్ సూచించారు. మండలంలోని రౌడీషీటర్లకు శిరివెళ్ల పోలీసు స్టేషన్‌లో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించిన, గొడవలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలు, కక్షలకు దూరంగా ఉండి కుటుంబంలోని పిల్లల భవిష్యత్తుకు, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 18: చాగలమర్రి గ్రామంలోని పెద్దమ్మ, చాగలమ్మ, చౌడేశ్వరిదేవి, గంగమ్మకు ఆదివారం వైభవంగా శ్రావణమాస పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య, లక్ష్మయ్య ఆధ్వర్యంలో గంగమ్మకు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



చౌడేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న భక్తులు

పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 18: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకొని కానుకలు సమర్పించారు.

రుద్రవరం: రుద్రవరంలో కొలువుదీరిన సంతాన వేణుగోపాల స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యత్రష్ఠదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.
- మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం సుంకులమ్మ మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు చీరలు అమ్మవార్లకు సమర్పించారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

పంటలు నమోదు చేసుకోండి

కోవెలకుంట్ల, ఆగస్టు 18 : గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల నమోదు తప్పనిసరి అని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటల నమోదు కోసం రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి పంట సాగు తెలియజేసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలతో పాటు పండించిన పంటలను అమ్ముకోవడానికి వీలవుతుందన్నారు. పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు వర్తించవని ఆయన తెలిపారు. కాబట్టి రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

సీఐకి అభినందనలు



సీఐకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగుల జేఏసీ నాయకులు

కోవెలకుంట్ల, ఆగస్టు 18 : కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్‌ను జిల్లా దివ్యాంగుల జేఏసీ నాయకులు అండెనం దేవరాజుతోపాటు మరికొంత మంది ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. దేవరాజ్ మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను సీఐకి తెలియజేశారు. 2016 పీడబ్ల్యూడీ యాక్టు గురించి వివరించి వికలాంగుల చట్టాలు అమలు చేయాలని కోరారు. సీఐ సానుకూలంగా స్పందించి వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారని అన్నారు. కార్యక్రమంలో రమణ, ఓబులేసు, సుబ్బరాయుడు, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ, ఆగస్టు 18: మండలంలోని మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని ఇండ్ల వర్షితకి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్ ఆదివారం తెలిపారు. విద్యార్థి వర్షిణి 2024 పది పబ్లిక్ పరీక్షల్లో 528 మార్కులు సాధించి స్కూల్‌టాపర్‌గా నిలిచిందన్నారు. దీనికి గ్రామానికి చెందిన దాత వెన్నపూస నరేంద్రరెడ్డి స్పందించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయరెడ్డి ఉన్నారు.

ఎస్‌ఐని కలిసిన టీడీపీ నాయకులు



ఎస్‌ఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రుద్రవరం, ఆగస్టు 18 : రుద్రవరం ఎస్‌ఐగా వరప్రసాద్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం మండల టీడీపీ నాయకులు రంగనాయకులు, నంద్యాల ఎస్సీ సెల్ పార్లమెంటు కార్యదర్శి కొమ్మలపాటి రాజారావులు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. మండలంలో సమస్యలు లేకుండా పరిష్కరించాలని టీడీపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏరువ క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్, వార్డుమెంబరు దస్తగిరి, ఖాసిం, మౌళాలి, పాఠశాలల ఛైర్మన్‌లు వెంకటేశ్వర్లు, ప్రసాద్, తాలుకా సోషల్ మీడియా వైస్ ప్రెసిడెంటు గురప్ప తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను శిక్షించాలి



డోన్‌లో వైద్య విద్యార్థిని మృతికి సంతాపం తెలుపుతున్న పెన్షనర్లు

డోన్(రూరల్), ఆగస్టు 18: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి అతి దారుణంగా హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో వైద్య విద్యార్థిని మౌమితా మృతికి సంతాపంగా మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కల్వ సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్, దాసప్ప పాల్గొన్నారు.

- కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి అతి దారుణంగా హత్య చేసిన నిందితులను శిక్షించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ నాయకులు చిన్న రెహిమాన్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ దేశంలో మహిళలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సీఐని కలిసిన ముస్లిం సంఘం నాయకులు



సీఐ ఇంతియాజ్‌బాషాను సత్కరిస్తున్న ముస్లిం అసోసియేషన్ నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 18: పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను ముస్లిం నూర్ బాషా వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐని కలిసి పూలమాలలు, శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సభ్యులు క్వాలిటీ అబ్దుల్లా, క్వాలిటీ రహిమాన్, టైలర్ ఖాజా, టైలర్ రెహిమాన్, ఇబ్రహీం, జహరుద్దీన్, కాశీం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పురోహితుడు శేషావలి శర్మ

డోన్(రూరల్), ఆగస్టు 18: పురోహితులు, అర్చకులు, వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఆత్మీయ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని డోన్ సాంబ శివాలయం అర్చక పురోహితుడు శేషావలి శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని గాయత్రీ పీఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పురోహితులు, అర్చకులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. పురోహిత అర్చకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.